## గోవును రాష్ట్ర మాతగా ప్రకటించాలి



సంతకాల సేకరణలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 24 : ప్రతి ఒక్కరూ గో మాతను ప్రేమించాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. గోవును రాష్ట్ర మాతగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోవులను సంరక్షించుకోవడానికి బాధ్యతగా కృషి చేయాలని, గోవుల సంరక్షణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తెలంగాణ బజరంగ్ సేన కృషి చేయనున్నట్లు వెల్లడించారు. గో మాతను 'మదర్ ఆఫ్ ది నేషన్'గా గుర్తించడానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘటన్ మంత్రి సురేందర్ సురానాజీ, సంజయ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, వినయ్‌తివారీ, మనోజ్, రామేశ్వర్‌మిశ్రా, గోవింద్ ఇండోరియా, ప్రియాచారి, రంజిత్ సింగ్, భవాని, కిరణ్, నరేశ్, రాందాస్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి




ప్రయాణికులకు ఉత్తమ సేవలను అందిస్తూ సంస్థకు ఆదాయాన్ని సమకుర్చడానికి సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు షిర్డీ దేవాస్థానికి ప్రత్యేక బస్సును మంగళవారం ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్.ఎం. జగన్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ కాచిగూడ బస్‌స్టేషన్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలు దేరుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాచిగూడ డిపో మేనేజర్ టి. రఘు, శ్రీనివాసులు, అయోధ్యరాములు పాల్గొన్నారు.

– కాచిగూడ, డిసెంబర్ 24

## కాడిగె పాండయ్య సంతాప సభ



కార్వాన్ పద్మశాలి సంఘం నాయకుడు, పద్మ శ్రీ అవార్డు గ్రహీత కాడిగె పాండయ్య సంతాప సభలో పాల్గొన్న కార్వాన్ పద్మశాలి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు.

– కార్వాన్, డిసెంబర్ 24

# నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాల పాత్ర ఎనలేనిది



ఇంద్రప్రస్థ కాలనీలో సీసీటీవీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 24 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఇంద్రప్రస్తకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాల ప్రాముఖ్యం ఎనలేనిదని అన్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతోనే కాకుండా కాలనీ ద్వారా వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు శ్రీరాములుముదిరాజ్, టి.రమే శ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జియాగూడలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జి. శంకర్‌యాదవ్, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ తదితరులు

కార్వాన్, డిసెంబర్ 24: దివంగత ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోయిని దర్శన్ అధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం జియాగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ జి. శంకర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, మాట్లాడుతూ భారత ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో దేశంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, ఔటర్ రింగ్ రోడ్ లతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో, ఆర్థికపరమైన అంశాలలో ఆయన తీసుకువచ్చిన మార్పులతో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. యువత వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. క్రీడలలో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో దృఢంగా ఉంటుందని, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని సూచించారు. జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ మాట్లాడుతూ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని రెండు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామని ఉత్తమ జట్లకు బుధవారం ఫైనల్స్ ముగిసిన అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్‌తో పాటు బీజేపీ నాయకులు బోడి అన్నా యాదవ్, నామా యాదగిరి, మనీష్, శ్రీకాంత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీ బకాయిలు ఇవ్వకపోతే సచివాలయాన్ని దిగ్బంధం చేస్తాం

రవీంద్రభారతి, డిసెంబర్ 24: నాలుగు సంవత్సరాలుగా తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిల నిధులు వెంటనే విడుదల చేయాలని, బడా కాంట్రాక్టర్ల బిల్లులు ఆపి ముందుగా పేద విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని లేదంటే వేలాది మంది విద్యార్థులతో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో నరసింహనాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో జనవరి 8న ఇందిరాపార్కువద్ద బీసీ సమర శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా రాష్ట్ర సచివాలయాన్ని, దిగ్బంధం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఇంటర్ డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర వృత్తివిద్య కోర్సులు చదువుతున్న12లక్షల మంది విద్యార్థుల ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల చేయపోవడంతో ప్రతి సంవత్సరం జరిగే వార్షిక పరీక్షలు రాయలేకపోతున్నారని, అలాగే కోర్సులు పూర్తి అయిన ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారన్నారు. దీంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలను నిర్మిస్తామని చెప్పి మాట ఇచ్చి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని విస్మరించారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దోచిపెట్టకుండా రూ.5వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 8వ తేదీన ఇందిరాపార్కు వద్ద వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో సమర శంఖారావం మహాసభను నిర్వహిస్తామని అన్నారు. ఈ సభకు విద్యార్థులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

## 27 నుంచి శ్రీకృష్ణ నీతి ప్రవచనాలు



శ్రీ గోవిందదేవ్ గిరిజీ

అబిడ్స్, డిసెంబర్ 24 : గీతా పరివార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వామిజీ శ్రీ గోవిందదేవ్ గిరిజీ మహారాజ్ శ్రీకృష్ణ నీతి ప్రవచన మాల ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు పరివార్ జాతీయ ఉపాధ్యక్షుడు హరినారాయణ్ వ్యాస్, అధ్యక్షుడు సునీత ధరక్, కార్యదర్శి గౌరవ్ హేడా, డాక్టర్ రాజు పేర్కొన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీలలో కింగ్‌కోఠిలోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో సాయంత్రం ప్రవచనాలు చేయడం జరుగుతుందని వివరించారు. శ్రీకృష్ణ నీతిపై లోతైన పరిజ్ఞానం అందరికీ జ్ఞానోదయం కలిగిస్తారన్నారు. శ్రీ గోవిందదేవ్ గిరీ మహారాజ్ శ్రీరామ జన్మభూమిలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం చేశారన్నారు. 1986 సంవత్సరంలో గీతా పరివార్‌ను స్థాపించిన స్వామీజీ బాల సంస్కార కేంద్రాలు ఏర్పాటు చేసి దేశంలోని 16 రాష్ట్రాలకు విస్తరించినట్లు తెలిపారు. 1990 సంవత్సరంలో స్వామీజీ మహర్షి వేదవ్యాస్ ప్రతిష్టాన్‌ను స్థాపించి 37 వేద విద్యాలయాల మాధ్యమం ద్వారా వేదాల పునరుజ్జీవన ప్రచారాన్ని ప్రారంభించారని తెలిపారు. అదే విధంగా గీతా సాధన శిబిరాలు, స్కాలర్‌షిప్ పథకాలు, ఇతర సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రచారాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## వైద్య విద్యార్థులకు మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయాలి



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ద్వారకనాథ్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 24 : రాష్ట్రంలో మంచి మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందేలా వైద్య విద్యార్థులకు లోకల్ మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథ్ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ వి. శోక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నీట్, పీజీ కౌన్సిలింగ్ 2024–25కి సంబంధించి ఇండియా కోటాలో రెండు రౌండ్లు పూర్తయ్యాయని, కానీ మెరిట్ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యార్థులు కనీసం రాష్ట్రంలో మంచి వైద్య కళాశాలల్లో సీట్లు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ క్రమంలో డిసెంబర్ 27న ఆల్ ఇండియా కోటా లో 3వ రౌండు దేశవ్యా ప్తంగా జరుగుతు న్నాయని అన్నారు. లోకల్ మెరిట్‌తో తెలంగాణలో సీట్లు పొందేలా వైద్య విద్యార్థులకు లోకల్ మెరిట్ లిస్టును విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 27న 'అరుణిమ జీవిత గాధ' పుస్తకావిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రచయిత డాక్టర్ సంధ్య విప్లవ్

రవీంద్రభారతి, డిసెంబర్ 24: ఉమెన్స్ రైటర్స్ పోరమ్ ఆధ్వర్యంలో డాక్టర్ సంధ్య విప్లవ్ రచించిన 'అరుణిమ జీవిత గాధ' పుస్తకావిష్కరణ సభ ఈ నెల 27 ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరిస్తున్నామని రచయిత డాక్టర్ సంధ్య విప్లవ్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నాకెంతో స్ఫూర్తి నిచ్చిందని, ఉద్యమ స్ఫూర్తితోనే రచయితగా మారానని తెలిపారు. తాను రచించిన త్రికాల చారిత్రాత్మక నవలను కూడా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, పీఓడబ్ల్యూ సంధ్య, కోయి కోటేశ్వరరావు, సభ అధ్యక్షుడిగా విజయ భండారి విచ్చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ చారి తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో అన్నదానికి వంటనూనె అందజేత



ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగనున్న కుంభమేళాలో ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ సంగం రామాలయం తరపున అందించే వంట సామాగ్రిలో లంగర్‌హౌస్ ఆర్యవైశ్య సంఘం తరపున వంటనూనెను అందజేస్తున్నారు. మంగళవారం సంఘం అధ్యక్షుడు విప్పు మాథుర్, ప్రధాన కార్యదర్శిరెడ్డి కృష్ణమూర్తి, కోశాధికారి వేముల రాములు, పీఆర్ఓ ప్రవీణ్‌కుమార్ సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాను కలిసి తాము అందించే సహకారం గురించి వివరించారు. వీరితో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు గౌరిశెట్టి బాబురావు, ముసత్యాల శ్రీనివాస్, దేసు వెంకటేశ్, తాడిశెట్టి వంశీమోహన్, పార్సీ లక్ష్మణ్, కంచర్ల వెంకటేశ్, రాములయ్య, కేశవులు, విజయలింగం, దశరథం పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 24

## విద్యార్థులు సాంకేతిక రంగంలో అభివృద్ధి సాధించాలి



ఫియెస్టా వార్షికోత్సవాలలో పాల్గొన్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి, కాంటినెంటల్ దవాఖాన ఎండీ గురు ఎన్ రెడ్డి తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 24 : విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక రంగంలో అభివృద్ధి సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి పిలుపునిచ్చారు. అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఫియెస్టా–2024 వార్షికోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాటాడారు. కాంటినెంటల్ దవాఖాన చైర్మన్, ఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి , అజిత్‌కుమార్, బ్రిడ్జి మోహన్, సంపత్‌కుమార్, శ్రీధర్, బాల్‌రెడ్డి, రమేశ్, సునీత, దీప్తి జైస్వాల్ పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ



తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల పేదలకు నిత్యావసర సరుకులతో కూడిన కె.వి.ఆర్.సి. కిట్‌లను పంపిణీ చేయగా ప్రముఖ సంఘసేవకులు భరత్, కొల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

– (తెలుగు యూనివర్సిటీ)

## క్రీడలు యువతలో పోటీతత్వం పెంచుతాయి




క్రీడలు యువతలో పోటీతత్వం పెంచుతాయని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మాసాబ్ ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఎంఐఎం నాయకుడు సర్ఫరాజ్ సిద్ధికితో కలిసి ప్రారంభించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 24

## అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలి



అంతర్గత రోడ్ల నిర్మించడానికి జీహెచ్ఎంసీ అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకిలో జీహెచ్ఎంసీ సర్కిల్ –13 డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ ఉదయ్‌లతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా అంతర్గత రోడ్ల నిర్మాణం గురించి అధికారులతో చర్చించారు. ప్రజలకు రవాణాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 24

## చికెన్ షాపులో దొంగతనం

అంబర్‌పేట, డిసెంబర్ 24 : బతుకమ్మ కుంటలోని ఓ చికెన్ షాపులో దొంగతనం జరిగింది. షాపులో పనిలో చేరిన ఓ వ్యక్తి మొదటి రోజే చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. తిలక్‌నగర్ చౌరస్తా–బతుకమ్మకుంటకు మధ్య లో భూక్యా రాజేందర్ అనే వ్యక్తి జేసీ రెడ్డి చికెన్ మార్కెట్ పేరుతో చికెన్ షాపును నిర్వహిస్తున్నాడు. బీహార్‌కు చెందిన హర్మ న్ (28)అనే వ్యక్తిని ఆదివారం పనిలో పెట్టుకున్నాడు. అదే రోజు రాత్రి పనిమీద రాజేందర్ ఊరికి వెళ్లాడు. అయితే ప్రతి మంగళవారం తాను తీసుకున్న సామాన్లకు డబ్బులు చెల్లిస్తాడు. అట్టి డబ్బు లక్ష రూపాయలు క్యాష్ కౌంటర్‌లో పెట్టి మంగళవారం వచ్చే వాళ్లకు ఇవ్వాలని షాపులో ప నిచేసే యాకుబ్, హరిలకు చెప్పి వెళ్లాడు. రాత్రి షాపులో యాకూబ్, హరిలతో పాటు కొత్తగా పనిలో చేరిన హర్మన్ కూడా పడుకున్నాడు. వీళ్లు నిద్రపోయిన తరువాత హర్మన్ హరికి సంబంధించిన రూ. 40వేల ఫోన్, క్యాష్ కౌంటర్‌లో ఉన్న లక్ష రూపాయలు తీసుకొని పరారయ్యాడు. తెల్లవారుజామున చికెన్ ఆర్డర్ రావడంతో హరికి ఫోన్ చేస్తే స్విఛాప్ వచ్చింది. వెంటనే యాకుబ్‌కు ఫోన్ చేశాడు. హరి కూడా నిద్రలేచి చూడగా తన ఫోన్ కనిపించలేదు. హర్మన్ కూడా కనిపించలేదు. డబ్బు లు చూడగా అవి కూడా కనిపించలేదు. వెంటనే విషయాన్ని యాకూబ్, హరిలు రాజేందర్‌కు తెలిపారు. ఊరి నుంచి వచ్చిన రాజేందర్ మంగళవారం అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## రైల్వేస్టేషన్‌లో దొంగతనం

కాచిగూడ,డిసెంబర్ 24: ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన ప్రణవసాకేత్ పోపూరి (20)మంగళవారం ఎంఎంటీఎస్ రైల్లో కాచిగూడకు రావడానికి ఫలక్‌నుమా ప్లాట్‌ఫాంలో కూర్చుంది. కొద్ది సేపటి తరువాత బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న రూ.15 వేల నగదు, ఫోన్ కన్పించలేదు. మంగళవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి..

కాచిగూడ, డిసెంబర్ 24: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. ఛత్రినాకకి చెందిన ఎల్.చంద్రమోహన్ (22) కూలీ. మంగళవారం కందికల్‌గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని వినతి



రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహకు సమస్యలను వివరిస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, డిసెంబర్ 24: మురికి వాడలలో నివసించే పేద ప్రజలకు ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గోషామహల్ నియోజకవర్గంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని గోషామహల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆయన రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహను మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో మురికివాడలు అధికంగా ఉన్నాయని, ఇక్కడ నివసించే పేదలకు ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాన లేక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు.

## శ్రమజీవుల చెమటకావ్యం ఆవిష్కరణ

రవీంద్రభారతి,డిసెంబర్ 24 : అవధాని అవుసుల భాను ప్రకాశ్ రచించిన కశ్పి శ్రమజీవుల చెమటకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కశ్పి శ్రమజీవుల చెమటకావ్యం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. 23 వృత్తులపై, ఆయా వృత్తి కారుల శ్రమ జీవన సౌందర్యం వర్ణించేలా భానుప్రకాశ్ రచించిన కశ్పి కావ్యం ఉందని ప్రకటించారు. ఆచార్య టి. గౌరీశంకర్ మాట్లాడుతూ.. కశ్పి కావ్యం శ్రమజీవుల కడగండ్లను, వృత్తుల ఘనతను వర్ణించేలా ఉందని ప్రశంసించారు. కశ్పి కావ్యాన్ని ప్రముఖ గీత రచయిత, మౌనశ్రీ మల్లిక్ సమీక్ష చేస్తూ శతాబ్దాల సాహిత్యాన్ని తరచి చూపినా, అన్ని వృత్తులను వర్ణిస్తూ చాలా అద్భుతంగా రాశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాస్యంసేనాదిపితి, కాంచనపల్లి మాట్లాడారు. అనంతరం కవిసమ్మేళనం, పలువురికి విశ్వ భారతి పురస్కారాలు ప్రదానం చేశారు.

## జేబీ రాజుకు అమృతోత్సవం

రవీంద్రభారతి, డిసెంబర్ 24 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రుతిలయ ఫౌండేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఆర్గనైజేషన్ అభినందనలతో అంబేద్కర్ వాది డా.జేబీ రాజు 85వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి 6.45 వరకు రవీంద్రభారతిలో జనబాంధవ పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ ప్రధాన కార్యదర్శి గాయని ఆమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, గడ్డం వివేక్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, జె.గీతా రెడ్డి విచ్చేసి జేబీ రాజుకు జనబాంధవ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నవరస గాయని సీల్‌వెల్ సినీ సుస్వరాలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ,ఎస్టీ,బీసీ అభిమానులు తరలిరావాలన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను ఖండాంతరాలకు విస్తరించేది కళాకారులే



భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఖండాంతరాలకు విస్తరించేందుకు అమెరికాలో నెలకొల్పిన సాయి నృత్య డ్యాన్స్ అకాడమీ బృందం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో శిష్య శారదాంజలి శీర్షికన నిర్వహించారు. కళాకారుల అద్భుత ప్రదర్శనను వీక్షించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తెలంగాణ కల్చర్ వారసత్వాన్ని కాపాడేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా కళాకారులు పనిచేయాలని సూచిస్తూ అకాడమీ గురువు సౌమ్య శ్రీధర్, శాలిని శ్రీనివాసన్, ప్యాడశర్మ, సింగర్ జనార్ధన్‌ల కృషిని ప్రశంసించారు.

– (తెలుగు యూనివర్సిటీ)



## శబరికి అయ్యప్ప మాలదారులు

అయ్యప్ప మాలదారులు మంగళవారం శబరిమలైకి తరలి వెళ్లారు. గుడిమల్కాపూర్ శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇరుముడి కట్టుకుని బయలుదేరారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తి పాటలు పాడుతూ.. మంజు స్వామి నేతృత్వంలో మాలదారులు కునాల్ స్వామి, ప్రవీణ్ స్వామి, విద్యాసాగర్, ప్రవీణ్‌లు శబరిలోని సన్నిదానానికి తరలగా రఘు గౌడ్ స్వామి ఏర్పాట్లు చేపట్టారు.

– (అబిడ్స్, డిసెంబర్ 24)

## సాంబశివరెడ్డికి సన్మానం



తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు సాంబశివరెడ్డిని నియమించిన సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ చైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్, కన్వీనర్ నరేందర్‌కురుమ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని కోర్టుల్లో ఖాళీగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను భర్తీ చేయాలని, ఇందుకు నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ విషయం పట్ల వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

– నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 24

## నేడు క్రిస్మస్ వేడుకలు




క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్చిలను ముస్తాబు చేశారు. పండుగ వేల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో పాటు నివాసాలపై క్రిస్మస్ స్టార్‌లు, ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గౌలిగూడలో నివసించే బాలునికి దేవాంషుకు శాంతా క్లాజ్ వేషధారణతో అలరించారు.

– (అబిడ్స్, డిసెంబర్ 24)

## హిందూ శ్మశానవాటిక ప్రచార కార్యదర్శిగా కృష్ణాగౌడ్



కాచిగూడ, డిసెంబర్ 24: అంబర్‌పేట హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు ప్రచార కార్యదర్శిగా నింభోలిఅడ్డా ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భీమాగౌని కృష్ణాగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృష్ణాగౌడ్ మాట్లాడుతూ దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో వృద్ధుడు మృతి

కాచిగూడ, డిసెంబర్ 24: రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60)శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–2 చివర్లో అనారోగ్యంగా ఉంటూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై పసుపు రంగు చొక్క, ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.